# స్వాతంత్ర్యము

శ్రీ వాసా సూర్యనారాయణశాస్త్రి

[ప్రదేశము - గృహారామము.]

సుందరి, లక్ష్మి వేదికలపై గూర్చుండి మాటలాడుచుందురు. సూరిశాస్త్రి ప్రవేశించును.

సుం — శాస్త్రిలుగారూ! నమస్కారాలు.

శా — శీఘ్రమేవ...సిద్ధిరస్తు.

సుం — మీకున్నూ ఈ పిచ్చి యున్నదండీ.

శా — నేను రిఫార్మర్ నేకాని స్త్రీలకు వివాహం వద్దని నోటితో చెప్పలేనమ్మాయి!

సుం — ప్రపంచమంతా పెండ్లిపందిరి అయి, కన్యకలందరు మగవారికి దాసీలు అయితే మీకు పరమ సంతోషం కాబోలు!

శా — అలాగు కాదమ్మాయి! పెండ్లిచేసుకొని లోలోన మగవారిని దాసానుదాసులుగా చేసుకుంటే నాకు పరమసంతోషం.

సుం — నేటి యువకులు అలాగు లొంగేవారే లెండి.

శా — ముక్కుపట్టి ముగుదాళ్లువేసి అలాగు చెయ్యాలి. అదీ మీ విద్యా చాతుర్యాములకు ఫలము. అంతే కాని మీరు పురుషజాతిని, పురుషులు స్త్రీ జాతిని బహిష్కరించి వేరయితే కొలదికాలంలో సృష్టి యేమగుతుందో ఆలోచించు. బుద్ధిమంతురాలవు.

సుం — తీతుకుపిట్ట ఆకాశం పడిపోకుండా కాలు అడ్డు పెట్టిందట! ఓహో! మేమే సృష్టి నిలువ పెట్టేవారము!

శా — కాదమ్మాయి! నీ నా కోసం మనము మాట్లాడుకోలేదు. నీవంటే స్త్రీలోకం అంతాను. నేనంటే పురుషలోకం అంతాను. ఏదో యొక వ్యక్తినిగూర్చికాదు మన సంభాషణ.

సుం — పెండ్లితో మా స్వాతంత్ర్యం పూర్తిగా నశిస్తుంది. అది మాకు దుర్భరం, దుస్సహం.

శా — అయితే పెండ్లి మాని యేమిచేస్తావు?

సుం — ఉద్యోగంచేసి వచ్చిన ధనముతో త్యాగ భోగాలు చేస్తాము.

శా — నౌఖరీలో మాత్రం పీల్చుటకు చల్లని మలయ మారుతాలు వీచుతాయి అనుకుంటావా? అది యెంత గొడవ! సేవ వాడికత్తితో నాలుక గీసికోవడం. పక్కమీద దేహం వాల్చినా కంఠము మీద సురకత్తులదండు వ్రేలాడుతునే యుంటుంది. అందుననే సేవ శ్వవృత్తి (కుక్కబ్రతుకు) అన్నారు అనుభవజ్ఞులు.

సుం — తమమాట సత్యమేనండి. మా నాన్నగారు పగటిభోజనం సరిగాచేసే యెరుగరు. రాత్రికూడా టపాలు చూచుకొని నిద్రలేక దొర్లుతారు.

లక్ష్మి — సుందరీ! ౫ గంట లయింది. వాచీచూడు.

సుం — ఈ దినం ఆటకు రాను. నీకు శాస్త్రిలుగారి సంగతి తెలియదు. ఫారములన్నిటిలోను వారి శిష్యులము. వారిక్లాసు మాకు పండుగ. చిరకాలానికి వారిదర్శనం. వారితో కొంచెం ప్రసంగింతాం. ఆట యెప్పుడూ వున్నదే.

శా — ఈ యమ్మాయి యెవ్వరు?

సుం — నెల్లూరునుండివచ్చి యీ సంవత్సరమే కలాశాలలో ప్రవేశించింది. మంచి చురుకయినది.

శా — నీవున్నూ పైకి వచ్చినావుగా.

సుం — "మాష్టరు" ఉద్యోగంచేస్తే స్వాతంత్ర్యానికి ఏమి భంగమండి!

శా — మాష్టరు అంటే వందలకొలది పిల్లలకు సేవకుడు. నూరు పుస్తకాలు చదివితేగాని ఒక పుస్తకం చెప్పజాలడు. మొండి, పిచ్చి, తెలివి లేని యెట్టి ప్రశ్నలు వేసినా శాంతముగా చెప్పి సమాధానపర్చాలి. దానికైనా యెందరో యధికార్లు వేధించేవా రుంటారు.

ల — దేశసేవ చేసుకొంటే యేబాధా లేదుగదా!

శా — అదికూడా సేవకాదూ! ఒకరికి కాదు. దేశమంతకున్నూ. ఒక మతానికి, ఒక నాయకునికి, లోబడి యందరిని మెప్పిస్తూ, సేవచేయాలి. దానికెంత లోకజ్ఞానం పాండిత్యం ధైర్యసాహసాదులు, యుక్తి చాతుర్యాదులు, మంచి నడవడియుండాలో యాలోచించుకో! మీ వంటి పడుచులు తగిన సహాయము ధనము లేనిదీ యిల్లు కదలగలరా? ఎన్ని ప్రమాదాలు?

సుం — ఇన్నాళ్లు చదువుగొడవలో కాలం గడచింది. ఇపుడు కర్తవ్యం తోచలేదు.

శా — నీవనుకొన్న స్వాతంత్ర్యస్వరూపం చెప్పితే కర్తవ్యం చెప్పతాను.

సుం — నా యంతర్వాణి చెప్పినట్లు చేయడమే స్వాతంత్ర్యం అనుకొంటున్నాను.

శా — నీ యాత్మకంటె జ్ఞానవిజ్ఞానములచే బాగా పరిపక్వమైన యాత్మ చెప్పినట్లు వింటే నీ స్వాతంత్ర్యమునకు భంగం ఉండునా?

సుం — లేదండి. జ్ఞానవంతులు చెప్పినట్లు చేయవలసిందే.

శా — అట్టివారు చెప్పినట్లు వినుటకూ, చేయుటకూ, నీ మనస్సు లొంగెనా సర్వము చక్కబడును. స్వాతంత్ర్యమంటే వినుము. అది యమూల్యమైన మనోభావము - జీవి, జన్మచే స్వతంత్రుడు. కావుననే పుణ్యము చేయును, పాపము చేయకును; అని శాస్త్రములు శాసిస్తున్నవి. అస్వతంత్రుని నెవ్వరూ శాసింపరు. కారాగృహబద్ధుని దేవాలయమున కేగమని కాని, సినిమాకు పొమ్మనికాని, యెవ్వరయినా చెప్పెదరా? నీ వనుకొన్న స్వాతంత్ర్యం చక్రవర్తికి కూడా లేదు. ప్రజాశయమునకున్నూ, పద్ధతులకున్నూ లోబడియే రాజ్యతంత్రములనునడుపవలయును. కారాగృహ బద్ధునకు గూడ నొక విధమైన స్వాతంత్ర్యం గలదు. తలవెంట్రుకను నూరు పాయలుగా చీల్చి చూపుటకంటె గూడ స్వాతంత్ర్యతంతువును విప్పిచూపుట కష్టతరము. ఎట్టి యిక్కట్టులో గూడ దానిని గాపాడుటకు నొక ద్వారము తెరవబడియే యుండును. అది పరిపక్వహృదయములకే స్ఫురించును. ఏ యాశ్రమము, ఏ వృత్తి, ఏ ఇక్కట్టులోనయినను, తన స్వాతంత్ర్యమును గాపాడుకొని జీవయాత్ర గడుపుటకు తగిన సూక్ష్మావకాశములు తరుచుగా నుండును.

ల — దానికి చిన్న యుదాహరణ చెప్పండి.

శా — వినుము - ఒక మహారాజుగారి కలాశాలలో ప్రిన్సిపాల్ పదవి ఖాళీ అయింది. దానికి నల్గురు పోటీచేసినారు. విద్యానుభవాదులచే నల్గురూ సమానులే. సహృదయవతంసుడగు నా మహారాజు చక్కని పోటీపరీక్షను బెట్టెను. ఒక టేబిల్ మీదను అయిదుపాత్రలతో పుష్పాసవమును (ఛాంపియన్) పెట్టించి యిది త్రాగవచ్చునండి. అని చెప్పి మహారాజు ఒక కప్పును గైకొనెను. వారిలో ముప్పురు తమ కలవాటు లేకున్నను, ఇచ్ఛకమునకై త్రాగిరి. నాలవవాడు మూచూచి పాత్రను యథాస్థానమున బెట్టెను. రసజ్ఞుడగు మహారాజు ఈతడు నన్ను గారవించుటకు మూచూచెను. తన వ్యక్తిస్వాతంత్ర్యమునకై త్రాగుట మానెను. కాబట్టి యాతిడె యర్హుడని యెంచి వానికే ప్రిన్సిపాల్ పదవి నిచ్చెను. కావున కురాశ, మొగమాటము, దౌర్బల్యము మున్నగువానికి లోబడి వ్యక్తి, తన స్వాతంత్ర్యమును గోల్పోవరాదు. గోల్పోయెనా, ఆవ్యక్తి చైతన్యము లేని బొమ్మ యని చెప్పవచ్చును. స్వాతంత్ర్యాభిలాషి, కొన్ని తావులయందు కష్టనష్టములకున్నూ, కొన్ని యెడల సర్వసంపదలకున్నూ లోనగును. స్వాతంత్ర్యం పేరుతో హద్దుమీరిపోరాదు. మనో

దౌర్బల్యముచే ప్రతిదానికి లోనుకారాదు. కావున స్వాతంత్ర్యం (**Freedom**) అందరికీ కోరదగినదే. స్వైరవిహారము మాత్రము దూష్య మ్మవుతుంది.

సు — మీ పురుషపక్షంలో మీరు చెప్పినదంతా సత్యమే కావచ్చును. కాని మావిషయంలో "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అనే సూత్రం బిగిస్తున్నదికదండి!

శా — మంచి ప్రశ్ననే వేసినావు. చూడు "పితా రక్షతి కౌమారే భర్తా రక్షతి యౌవనే, రక్షంతి వార్ధకే పుత్రా నస్త్రీ స్వాతంత్ర్యమర్హతి" — అని చెప్పినారు. బాల్యమున తండ్రి, యౌవనమున భర్త, ముసలితనమున పుత్రులు స్త్రీని కాపాడుదురు. అబలలు సర్వకోమలలగు స్త్రీలు, తమ్మతాము రక్షించుకొనజాల రని యెంచి యట్లు చెప్పినారు. అట్లు కాకపోతే భర్తతోపాటు తండ్రి, బిడ్డల రక్షణనుగూడా స్త్రీలు బహిష్కరింపవలసినదేనా? "నస్త్రీస్వాతంత్ర్యమర్హతి" — అంటె ఆత్మరక్షణశక్తి చాలదని దా యర్థముగాని మనోభావమైన స్వాతంత్ర్యము లేదనికాదు. ౧, ౩, పాదాలవల్ల నేను చెప్పిన యర్థము స్పష్టము.

సు — తాము చెప్పినది సత్యమేనండి. ఇపుడు అనుమాననివృత్తి అయింది—కాని పెండ్లిచేసుకుంటే మాత్రం ఈస్వాతంత్ర్యం అణుమాత్రం ఉండదని తోస్తుంది. అత్త, మామ, భర్త, గీచిన గీటుకూడా దాటరాదు. తుదకు ఒక విద్యాసంస్థకైనా పోరాదు. క్రొత్తకోడలంటే ఖయిదీ. సత్యకాలములో ఋషులు చెప్పినశ్లోకాలు మంత్రాలు చదివి యేమిచేసినా పాతివ్రత్యభంగమే అంటారు. అది మా భయము.

శా — నిష్కారణము ఋషులను, మంత్రాలను నిందించకు. వారు కరుణార్ద్రహృదయులు, మూడు కాలములకును సరిపడునట్లు చెప్పినారు. కేవలము తుచ్ఛమయిన యింద్రియలోలత్వమునకు వారంగీకరింపరు గాని మిగిలిన సర్వవిషయములయందును వారు మహోదారులు. వివాహమంత్రములూ, ఋషులూ అనుగ్రహించిన స్వాతంత్ర్యం మీరనేదనుకున్నదానికంటె పదిమండుగులు అధికము.

లక్ష్మి — అవి యేవో సంగ్రహంగా దయచేసి చెప్పండి.

శా — "గృహిణీ గృహముచ్యతే" భార్యయే యిల్లు అనగా గృహానికి సర్వాధికారిణి యని యర్థము. "మూర్ధానం పత్యు రారోహ ప్రజయాచ ధనేనచ" సంతానముచేతను ధనముచేతను భర్తకుప్రాధాన్యమును వహింపుము. సంతానము ధనము నీవువి యని యర్థము "సమ్రాజ్ఞీ శ్వశురే భవ...శం ద్విపదే చతుష్పదే" అత్త మామ మున్నగువారికి, ద్విపాద చతుష్పాదజంతువులకు సర్వమునకు, నీవే సర్వాధికారిణివి యని చెప్పి గృహప్రవేశకాలమందే మంత్రపూర్వకముగా సర్వము నొప్పగించును. మధూకరము అడిగేవాడుకూడా "భవతి! భిక్షాం దేహి" అని యమ్మగారినే సంబోధించి యడుగును. ముష్టివారున్నూ "అమ్మ బిచ్చ"మని అమ్మనే యడుగుదురు. "ధర్మే అర్థే కామేచ నాతిచరామి" ధర్మార్థకామము లనే మూడుపురుషార్థములలోను నిన్ను దాటి చరింపను అని యగ్నిసన్నిధిని భర్తచే ప్రమాణమును చేయింతురు. శాస్త్రప్రకారము భర్త తానుచేసిన పుణ్యములో సగపాలు భార్యకు ననాయాసముగా పంచిపెట్టును. పాపమునుచేసినా తానొక్కడే యనుభవించును. బైట సర్వకష్టములకు, సర్వనైచ్యములకు, సర్వపాపముల కోర్చి సంపాదించిన ద్రవ్యమునంతా భార్యచేతిలోనే పెట్టును. తనకేమాత్రముధనము మిగిలినా యామెకాభరణాలను జేయించి వస్త్రాలంకార భూషితయైన యామెను జూచి లోలోన మురియుచుండును. పూర్వకాలమున భార్యయే పురుషునకు చక్కని బ్యాంకు. పనికిమాలినపనులకు నామె శరీరముమీది యాభరణముల నడుగజాలడు. ఆమె యివ్వదు. న్యాయమైన యవసరము వచ్చినపుడు ఆమెయే తన బంగారము నిచ్చి యక్కరతీర్చును. పూర్వకాలములో గృహస్థులకు యజ్ఞముచేయుటయే పరమపురుషార్థము. అట్టియజ్ఞమునకు గావల

సిన సంభారములలో నొక్కదానినయినా, భార్య యనుమతి లేనిదీ యింటనుండి తీసికొనరాదు.

"పత్నీహిసారీణహ్యస్యేశే"—అని వేదంలోనే చెప్పినారు. ధనమును సంపాదించుటకే పురుషున కధికారము గాని దానిని రక్షించుటకు, వినియోగించుటకు స్త్రీలకే యధికారమును ప్రసాదించినారు. కావున మన వేదములు, ఋషులు వీా విషయములో పరమోపకారులేకాని ద్రోహులుకారు.

లక్ష్మి — అయితే ఎందుకండి అంతబంధిస్తారు స్త్రీని

శా — అది బంధించడం కాదమ్మాయి; అది భద్రం చెయ్యడం. రత్నాభరణాదులను పెట్టెలలో పెట్టి జాగ్రత్తచేస్తారు. చీపురు, తట్ట, బుట్ట, మున్నగువానిని బైటనే యుంచుతారు. మమ్మ బంధించినారని రత్నాభరణాదులు పోరాడవచ్చునా ?

"తస్మాత్ స్త్రీయువతిః ప్రియాభావుకా"

యౌవనముగల చిన్నది యందరికి ప్రియమైనది మంగళకరమైనది అని వేదంలోనే చెప్పినారు. పురుషుడు ఎవరిపేరుపెట్టి యెట్లు తిట్టినా సహించును గాని తన భార్యపేరుపెట్టి తిట్టెనా పొడిచి పొడుచుకొనును. హృదయరహస్యమును గుర్తెరింగినవారు దానిని నిర్బంధమని భావింపరాదు. ప్రేమమోహముల కట్టడి యని యెంచి సంతసింపవలయును. ఇంతకు వివాహములోని రహస్యము మీాకు పూర్తిగా తెలుస్తే యీ చిక్కులన్నీ తమంతట తామే తొలగిపోతాయి.

లక్ష్మి— చేసుకున్నా మానినా తెలుసుకోవడం మంచిదేకాదా! దయచేసి చెప్పండి.

శా — వినండి. శాస్త్రప్రకారము ఒక స్త్రీని సేకరించుట వివాహము. ఈ వివాహాల నెనిమిది విధములుగా విభజించిచూపినారు. వాటిలోగూడా పెక్కు లవాంతర భేదము లున్నవి. వివాహం మూలమున వధూవరుల హృదయములు రెండున్నూ యేకీభవించును. నాటిమొదలు సుఖదుఃఖముల యందు, మానావమానములయందు, సర్వవిషయములందున్నూ దంపతులకు నద్వైతభావమే యేర్పడును. ఎంతటితాపములనొందినా పరస్పరహృదయములకు పరస్పరమందే విశ్రాంతి గలుగును. ముదిమిచేగూడ నాదాంపత్యప్రేమ క్షీణింపదు. దినదినాభివృద్ధి నొందును. మంచిదాంపత్యముకంటె నీ నిస్సారసంసారములో భద్రమైన వస్తువు మరియొకటి లేదు. దంపతులప్రేమతంతువులు రెంటిని నొకటిగా జేర్చి గట్టిగావేసిన ముడియే సంతానము. ఎన్నడు ఇరువురి సప్తధాతువులు సంతానములో మిళితములై ఘనీభవించునో యదిమొదలు వారికి నేకీభావము అత్యంతము సదృఢమగును. హరిశ్చంద్రుడు చంద్రమతిని విక్రయించి తానమ్ముడు పోయెను. ఆమె కినిసినదా? ధర్మరాజు ద్రౌపదినోడి తనోడెను. ఆమెకాదన్నదా? మీాదుమిక్కిలి తన చాతుర్యముచే భర్తలను దన్నువిడిపించినది. దమయంతి ద్వితీయస్వయంవరమును చాటించినా తన్నురావించుటకే యట్లుచేసినదని హృదయరహస్యమును దెలిసికొని మిక్కిలి మురిసిపోయినాడు నలుడు. సర్వప్రపంచములోని వినోదములు, విలాసములు, చిత్రములు, విచిత్రములు, సంతోషములు అన్నియు దంపతులలోనే ప్రతిఫలించును. పరస్పరసన్నిధానమే పెన్నిధానము. అదియే ప్రత్యక్షస్వర్గము. ఆదాంపత్యవాహినిలోని ప్రేమతరంగములకు తరుగూ విరుగూ లేదు. అందు సర్వము స్వేచ్ఛయే. సర్వము స్వతంత్రమే. స్వపర భేదమునకు నాదాంపత్యమున నిలువ నీడయేలేదు. ఒకచేతికి దెబ్బతగిలెనా రెండవచేయి దానిని నిమురును. అందులో దేనికిని న్యూనాధికభావము లేదు. భర్త గతించెనా సహగమనమును చేయునంతటి యతిగాఢప్రేమ, యంతటి మహామోహము ఒక్క భారతభూమియందే నెలకొన్నది. భార్య మరణించెనా తిరిగి వివాహములేక విధురుడై యామరణాంత ముండుట మన చరిత్రలోనే కానవగును. స్త్రీల పాతివ్రత్య మహిమయు, నద్భుత దాంపతలి

బంధమును మన యసాధారణ భారత కీర్తిలతకు మూలాలవాలములు. ఈరెండే ఖండాంతరవాసులను నాశ్చర్యనిమగ్నులను జేసి వేయివిధముల బొగడ్తల నొందినవి. అట్టి భారతకీర్తికి హస్తావలంబము నీయ మీరే వలంతులు. పాశ్చాత్యనాగరకత ఎవరష్టు శిఖరాధిరోహణమును జేసి నేడు తలక్రిందుగా తిరుగబడుతున్నది. దాని వ్యామోహములో జిక్కితిమా వారికంటె నధోగతి పాలగుదుము.

లక్ష్మి — పురుషుడు భార్యయుండగా మరియొకదానిని పెండ్లియాడుచున్నాడు. ఇది న్యాయమా ?

శా — వివాహమునకు సంతానము ముఖ్యఫలము. అది లేనిచో మొదటి భార్యయనుమతితో రెండవ యామెను పెండ్లి కూడు మని చెప్పినారు. మొదటి భార్య స్వయముగా అగ్నిహోత్రము నీయవల యును. దాని సాక్షిగా రెండవ యామెను పెండ్లి యాడవలయును. ఆమె యగ్నిహోత్రము నీయకుండినా ద్వితీయవివాహము శాస్త్రప్రకారము సిద్ధింపదు.

సు — నేడు అట్లె జరుగుతున్నవండీ ?

శా — శాస్త్రము, పూర్వాచారము లట్టివియని చెప్పినాను. వానిలో దోషము లేదు. నేడు సర్వము కట్టతెగి పొంగి పారలిపారుచున్నది. దానికి పూర్వులనుగాని, వారి పద్ధతులనుగాని ఎంత మాత్రము నిందింపరాదు.

లక్ష్మి — శాశ్వతబ్రహ్మచర్యం స్త్రీలకు కూడదా ?

శా — కొందరు బ్రహ్మచారులు బ్రహ్మచారిణులు కూడ దేశమున కవసరమే. కాని యీ కాలమున బ్రహ్మచర్యము మహత్తరకష్టము. మహాప్రమాదకరము. కాన దూరదృష్టిగలవారు ఇక్కాలమున బ్రహ్మచర్యముకూడదని నిషేధించినారు

సుం — అంతకష్టమండి బ్రహ్మచర్యము ?

శా — అంతకంటె వేరొకటి కష్టములేదు. గాలి, నీరు, ఆకు, అలము తిని తపస్సుచేసిన మహాయోగులు విశ్వామిత్ర పరాశరాదులుకూడా తప్పత్రోవను బడినారు. మనము ఉల్లా ? వాశా ? సముద్రమునంతను త్రాగుటకంటెను, మేరు పర్వతమును పెకలించుటకంటెను ఇంద్రియములను నిగ్రహించుట మహావిషమ మని యర్జునుడు కృష్ణునితో స్వానుభవమును జెప్పకొన్నాడు. నిజమయిన బ్రహ్మచర్య మనగా స్త్రీపురుషులు ఒండొరులను స్మరింపకుండుట. పేరునుగూడ బేర్కొనకుండుట. ఆట, చూపు, రహస్యసంభాషణ మున్నగునవికూడ లేకయుండుట. ఇట్టి బ్రహ్మచర్యము సాధ్యమా ? మనస్సాక్షిని మేల్కొలిపి సత్యమును చెప్పినచో కోటికి నొక రుండుట కష్టము. ఒక్కొక్క సమయమున నింద్రియప్రకోపము నూరు తేళ్లు ఏకకాలమందు శరీరమంతః కరచినట్లుండును. దానిని జయించుట మానవ ప్రకృతికి నతీతవిషయము. జీవులు ప్రకృతికిలోబడి ప్రవర్తింతురు. నిగ్రహము కష్టసాధ్యమని గీతలలోనే చెప్పబడినది. పలువురు బాలురు బాలికలు బ్రహ్మచర్య మనుపేరుతో వీరాలాపములను బలికి కొంత కాలము గడచినపిదప పరమనీచకృత్యములకు లోబడి ఛీ ఛీ యనిపించుకొన్నారు. అసువులను గోల్పోయినారు. ఆత్మహత్యలను జేసుకున్నారు. ఇంటికి ఒంటికి నపకీర్తి తెచ్చినారు. చేతులు కాలినపిదప నాకులు పట్టిన లాభ మేమి ? ముందుగానే భవిష్యత్తు నూహించి సంసారమార్గమును బట్టుట మంచిది దినమున కెన్నియో ఫలాహారములు భోజనములు వింతవింతరుచులు, గంటకొకవింత వింతవేషములు, పెక్కువినోదాలు ఇట్టి యుద్దీపక సామగ్రిలో మునిగి తేలియాడుచు బ్రహ్మచర్య మనుట దాని పరువుతీయడం. అది సిగ్గుచేటు. కొలది కాలముక్రిందట బాలికలు పెండ్లియనిన ముసిముసి నవ్వులతో మురిసేవారు. నేడు పెండ్లిపే రెత్తుట యనాగరకత. కొలదిదినములలోనే దీని విపరీత పరిణామం లోకానికి తెలుస్తుంది. దేవుడు ఏడమ్, ఈవులను దంపతులై తిరిగి సృష్టిచేయు డని యానతిచ్చెనని విందుము. క్రిందటి జర్మనీమహాసంగ్రామానంతరమున పలుదేశములవారు ప్రజాసృష్టికై పెక్కుపాట్లు పడినారు. తన యాత్మను తాను

చంపుకొనుటకు యత్నించువానిని ప్రభుత్వం ఎందుకు శిక్షిస్తున్నదో మీరు చెప్పండి.

లక్ష్మి— వాని తల్లి దండ్రులు మున్నగువారికి దుఃఖము గలుగుతుం దని.

శా — విచారించేవారు లేనపుడు హత్య చేసుకొన వచ్చునా ?

సుం— అదికాదండి. ప్రతిజీవి సంఘమునకు నొక యవయవము. తన కృత్యమును జేయక హత్యాప్రయత్నమును జేసినందుకు శిక్షార్హుడు.

శా — సరిగా చెప్పినావు. స్త్రీపురుషులుకూడా సంఘావయవములే. వారును సృష్టిసూత్రమును పెంపొందించి తమ విధిని నెరవేర్చవలయును. కానిచో శిక్షార్హులే యగుదురు. శంకరులు, రామమోహనులు, శివాజీ మున్నగు మహాపురుషుల తల్లులు బ్రహ్మచర్యమునే పాలించినచో దేశముగతి యేమయి యుండునో తిలకింపుడు.

సుం— గంగకు కాలువకు సాటి !

శా — ఏ భూగర్భములో నే మహారత్న ముండునో యెవ డెరుంగును? బంగారుగర్భము లేవిన్ని కావు. అన్ని మాంసమయగర్భములే. రామ్ సే మాగ్డనాల్డు జన్మతోనే ప్రధానమంత్రి యగునని యనుకొనిరా ?

సుం— మా యూహ లన్నీ పెడదారినే పయనమును సాగిస్తున్న వండి.

శా — అది మీ దోషం కాదు. విద్యావిధానదోషం. తల్లిదండ్రులదోషం. మాదోషం.

లక్ష్మి— ఈవిద్య తప్పంటారా ?

శా — విద్య తప్పనను. విధానంతప్పంటాను. ఈవిధానములో నొకవిద్యార్థికైనా తన మతమునుగూర్చి యొకయక్షరమైనా తెలుస్తున్నదా? తల్లిదండ్రులు, గురువులు, దానిని బోధిస్తున్నారా? మహమ్మదీయులు మనదేశాన్ని అయిదు వందలు సంవత్సరాలు పాలించినా వేషభాషలలో నించుకైనా మారలేదు. ఇంగ్లీషువారు ౧౫౦ సం॥లనుండి మనతోనే కలిసిమెలిసియుండి పాలిస్తున్నా వీసం మారలేదు. మనమో కోతులవలె పరుల ననుకరిస్తున్నాము. ఒకరికట్టు, ఒకరిబొట్టు, ఒకరిపలుకు, ఒకరి తళుకు. ఆంధ్రుడు ఆంధ్రుడనిపించుకొనుట యనాగరికత. తనవానితోగూడ తనమాతృభాషతో మాట్లాడరాదు. ఆడినా సగపాలు ఇంగ్లీష్. మీ యింట ఎపుడు పెండ్లి? మండే పెళ్లి-అని సమాధానమును జెప్పను. సోమవారమని నాలుక చివరకు రాదు. బెంగాళీవారు మున్ముందు నాంగ్లభాషకు స్వాగతమిచ్చినన్నీ పిదప మరలి మాతృభాషాదేవిని బూజించి సాహిత్యములో, శాస్త్రములలోన, జగత్తంతటను నేడు వాసి కెక్కినారు. ఈ తెలుపునలుపు గంగాయమునల సంగమములో అలజడి యెక్కువ యయింది. ఏభాషలోనయినను విద్య(జ్ఞానము) పూజ్యమైనదే. కేవల పరీక్షకు ౩౫ మార్కులకు జదువుటలోనే వింతవింత వికారాలు పొడమాపినవి. ౩౫ మార్కులు చాలునంటే ౬౫ తప్పులుచేయుటకు నించుమించుగా ననుమతిని దయచేసినట్లే కదూ! స్త్రీలకు ౧౨ సం॥లకు కలిగే జ్ఞానం పురుషులకు ౧౮ సం॥లకుగాని కలుగబోదు. స్త్రీలకు ౫౦ సం॥లకు సర్వశక్తులు ఉడుగును. పురుషునకు యావజ్జీవము శక్తులు దీపించును. ఇట్టి భిన్నప్రకృతులకు ఒకే విద్యా విధానము ఎట్లు చక్కబడునో నే నూహింపజాలను. స్త్రీల కుద్యోగాపేక్షయే లేకపోతే ఈ విద్యావిధానములో సగపాలు వృథాప్రయాసం?

ల — స్త్రీలకు సర్వవిషయముల నుద్యోగము కూడదనియేనా మీ నిశ్చితాభిప్రాయం?

శా — పురుషులతోపాటు సగపాలు ధనార్జనాభారము స్త్రీలు మోస్తామంటే యే పురుషుడు కాదంటాడు ? కాని ఒకటి రెండయితే గరుత్మంతులు అంతకు మించితే బొల్లిగద్దలు. స్త్రీలు కొలదిగానే యుద్యోగములో ప్రవేశించినారు గనుక మర్యాదగా చూస్తున్నారు. సంఖ్య పెరిగిన నది దక్కదు. స్త్రీల సర్వాంగ కోమల రమణీయ భావములే కవితా సామ్రాజ్యమునకు మూలబల

షులు. ఉద్యోగములో నవి నానాటికి కృశించి మోటువారును. సత్యముగా పురుషులలో పౌరుషము నేతిబీరకాయ. స్త్రీలలోనే యది మెండు. అట్టి తమ పౌరుషము నుద్యాపన చేసి కలము పట్టవలయును. శిశుసంరక్షణ గృహకృత్యనిర్వహణాదులను బరులచేతిలో బెట్టవలయును. అది మంచిపద్ధతి యని తలచితే యుద్యోగము చేయవచ్చును—

మాకు పూజాపురస్కారములు అక్కరలేదు. మేము శాలలో కట్టుబడి యుండజాలము. మీవలె నెండకు వానకోర్చి మునకాళ్లపోట్లకూ కొరడా దెబ్బలకూ తాళి బాటలలో బండ్లు లాగుతాము. పొలములలో దున్నతాము అని యావులు తగవు పెట్టితే యే యెద్దయినా కాదంటుందా? ఇదన్నీ యట్టిదే. ఉద్యోగము మేడిపండు, పయోముఖ విషకుంభము. తేనెపూసిన కత్తి. మురికి కాలువలో సువాసన. ఉద్యోగములో గౌరవము, ఎండమావులలో నీరు సమానముగానే యుంటవి. పొట్ట గడవకపోతే ముష్టితరువాత చేయవలసినపని యుద్యోగము. అనగా బానిసవృత్తి—

సుం— శ్రమ యిచ్చినాము. స్త్రీలదాయ విషయములో మీయభిప్రాయం చెప్పండి.

శా— తాను పుట్టింటిదాయమును మోసుకొని పోవు సరికి నత్తింటిపడచులు తమదాయమును వారు మోసికొనిపోయి యుందురు. ఇరువురకు మోతశ్రమయే మిగులును. దాయభాక్కులగు స్త్రీలను బోషించు బాధ్యత పురుషులకు తగ్గును.

సుం— అట్లయినా స్త్రీకి తనహక్కుగా కొంత యాస్తి యుండుట మంచిది కాదండి.

శా— వివాహకాలమున పితాదులు అత్తవా రొసంగిన స్త్రీధనము తనకున్నది. మనపూర్వపద్ధతి ప్రకారము భర్తృగృహమునకు తానే సర్వాధికారిణి. త్యాగభోగములు రెండున్నూ తనవే. తాను పెట్టినదే భర్తకు ప్రసాదము. ఇట్టిస్థితిలో నొకయింటిలో రెండు ధనపేటికలు, రెండు తాళంచెవులు, ఆ ధనమునకు వేర్వేరు సంరక్షణ బాధ్యతలు, నిజమైన యైకమత్యమునకు గుర్తులుగావు. దంపతులలో నొక విషయమున విభాగము జనించెనా అది యంతటను వ్యాపించును. దరిద్రకుటుంబములలో జనించిన యుత్తమకన్యకలకుమాత్రము తగిన సంబంధములు చేకూరుట యసంభవము. పురుషుని విషయంలో సోదరి దాయమును సేకరించును, భార్య తీసికొని వచ్చును. ఇందు పురుషునకు లాభనష్టములు సమానములే. స్థిరాస్తులను జీల్చుట, దూరమందున్న తోబుట్టువులు వాని ఫలములను రాబట్టుకొని యనుభవించుట సుకరములుగావు. ఏది యెట్లున్నను పురుషులు దీనికై తగవులాడరని నా నమ్మిక—

సుం— చాల శ్రమ యిచ్చినాము. లోనికి బోయి యల్పాహారమును గైకొందము; రండు. (మువ్వురును గృహములోని కేగుదురు.)

(శేషమ్మ ప్రవేశించి)

శే— శాస్త్రిగారూ! చిరకాలానికి దయచేశారు మాసుందరి తనమాటే కాని ఎవరుచెప్పినా ఖండించి వేస్తుంది. నేను పెద్దదానను. నాచేతితో దాని తలపై నక్షతలు వేసేటట్లు బాగా బోధపరిచారా?

శా— అమ్మా! చిన్నసంగతి చెప్పతాను. ఒకతర్కవిద్యార్థి నూనె కొనుటకై గానుగవాని యింటికి స్వయంగా వెళ్లి నూనె కొని మెడగంటచప్పుడుతో గానుగచుట్టూ తిరుగుతున్న యెద్దును జూచి 'ఎందుకు ఎద్దుమెడలో గంటకట్టినా'వని గానుగవానిని ప్రశ్నించినాడట. 'నేను ఇంటిలో పనిపాట్లకు పోయినపుడు గంటచప్పుడును బట్టి ఎద్దు తిరుగుతున్నదీ లేనిదీ తెలుసుకొనుటకు కట్టినాను' అని చెప్పగా విద్యార్థి 'తాను తిరగకుండా నిలిచి మెడత్రిప్పి గంటచప్పుడు చేస్తే నీ కెట్లు తెలియు'నని యడుగగా గానుగవాడు 'బాబూ! మాయెద్దుకు అంతతర్కం రాదు.' అని సమాధానం చెప్పెనట. సుందరి స్వతఃచురుకయినది. అందులో లాజిక్ చదివింది. మనమాటలు నిలువనిస్తుందా?

సుం— మాలాజికన్న అంతా మీతర్కానికి కన్నబిడ్డ కదండీ!

శా — సుందరమ్మ! పోయివచ్చెద.

సుం— నమస్కారాలు. తిరిగి మరియొకసారి దర్శనం దయచేయండి. తాము చెప్పిన విషయాలన్నీ ఈ లోపున బాగా మననం చేస్తాము. శ్రమయిచ్చి నందులకు క్షమించండి.

అందరు నిష్క్రమింతురు.

---

## జాబులు :

ఆర్యా,

ఈ దిగువను నేను వ్రాయు విషయమును తాము పరిశీలించ ప్రార్థించుచున్నాను. ఈ మార్చి భారతియందు శ్రీ మండా నరసింహంగారి "మీరా బాయి" వ్యాసము చూచుభాగ్యము లభించినది. కథారచన సరళముగానే యున్నది. కాని చరిత్రకాధారభూతమును, ముఖ్యముగను "కాలము"నుగూర్చి యీ వ్యాసకర్త ప్రాధాన్యత యిచ్చినట్లు తోచదు.

సాధారణముగా వ్యాసకర్తలు చరిత్రయందు విఖ్యాతులగు మహనీయులకు వారికి సమకాలికులు కాని అన్యులకథాంశములను అనాలోచితముగా జత పరుచుట ఆచారమై యున్నది. శ్రీ కృష్ణదేవరాయల కాలమునాటికి లేని పింగళిసూరన్నను రాయలవారికినీ, తెనాలిరామకృష్ణునకునూ జతపరిచి కొన్ని నిరర్థక కథలనుకూడ చెప్పుదురు. అట్లే మహావిఖ్యాతుడగు రాజ రాజనరేంద్రునకు, ఆధారములేని చిత్రాంగీ సారంగధరులకథను అంటగట్టెదరు.

ఇప్పుడు మరల యీ వ్యాసకర్త మహాభక్తురాలయిన "మీరాబాయి"ని చూచుటకై మొగలాయి సార్వభౌముడగు అక్బరుచక్రవర్తి తాన్సేను సహితముగా వచ్చె నని వ్రాయుచు రత్నహారమునుగూడ బహూకరించె నని వ్రాసెను.

చరిత్ర చూచినచో మీరాబాయి రాణాకుంభుని భార్య. ఈతడు మీవారు దేశరాజు. శ్రీ. కో. లక్ష్మణరావుపంతులుగారి మహమ్మదీయ మహాయుగమునందు పేజి ౨౪౭ లో యితడు క్రీ. శ. ౧౪౩౩ లగాయతు ౧౪౬౮ వరకు రాజ్యముచేసె నని వ్రాయబడియున్నది. అక్బరురాజ్యమునకు ౧౫౫౬ లో వచ్చెను. అనగా కుంభరాణా మరణించిన నూరు సంవత్సరములవరకు అక్బరు రాజ్యమునకు రాలేదు. అక్బరుకు సమకాలికుడు మీవారురాణా, ప్రతాపసింహుడు. రాణాకుంభునకు ప్రతాపునకు మధ్య కొందరురాజులుమీవారు రాజ్య మేలిరి. పైగా ౧౫౨౬ సం॥ పూర్వము మనదేశములో మొగలాయి రాజులు లేరు.

అట్టిచో అక్బరు మీరాబాయిని దర్శించుటకు వచ్చెననుట యెట్లు పొసగును? అక్బరుచక్రవర్తి స్వయముగా వచ్చి మీరాబాయికి రత్నహారము సమర్పించినగాని మీరాబాయిఘనత వెల్లడి అగుటకవకాశము లేదా? వ్యాసకర్త కేవలము పుక్కిటిపురాణములనే ఆధారముచేసికొనుటకు బదులు చరిత్రను శ్రద్ధతో పరిశీలించరాదా? చరిత్రలో ప్రసిద్ధుడైనంత మాత్రమున ప్రతికథయు అక్బరునకే ముడిపెట్టుట హాస్యాస్పదముగా నుండు నని చెప్పుటకు సాహసించుచున్నాను.

భవి: డిపాటి సీతారామయ్య

---